విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 09 ఆగస్టు 2025 8 పేజీలు

ప్రజలతో మమేకమవ్వాలి

సచివాలయ సిబ్బందికి కలెక్టర్ సూచన

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఒకటవ తేదీన అర్హత కలిగిన లబ్దిదారులకు వారి నివాసాల వద్దకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేసేందుకు కట్టుబడి ఉందని, ఈ కార్యక్రమం ప్రజల సంతృప్తికి దోహదపడేలా కార్యకలాపాలు నిర్వహించాలని పెన్షన్ పంపిణీ అధికారులకు (వార్డు, వలంటీర్ స్థాయి అధికారులు) జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. 49వ వార్డులో పెన్షన్ పంపిణీ ప్రక్రియపై స్వయంగా సమీక్షించేందుకు కలెక్టర్ శుక్రవారం లబ్ధిదారులను, స్థానిక ప్రజలను ప్రత్యక్షంగా కలసి, వారి అభిప్రాయాలు స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల బదిలీల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను అనుసరించి పలువురు సచివాలయ సిబ్బందిని బదిలీ చేసిన సంగతి తెలిసిందే అన్నారు. కొత్త ప్రదేశాల్లో విధులు ప్రారంభించిన వారు స్థానిక ప్రజలతో మమేకమై పనిచేయాలని, వారిని అర్థం చేసుకుని, సేవలందించడంలో ▶మిగతా 2లో..

మారని బతుకులు... ఆగని కన్నీళ్లు

- అమలు కాని కనీస వేతన చట్టం
- దశాబ్దాలుగా సేవ చేసినా ఫలితం శూన్యం
- వట్టి చేతులతో పదవీ విరమణ పొందుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

> వారు పర్మినెంట్ ఉద్యోగులతో పాటు సమానంగా పనిచేస్తారు. కానీ వాళ్లతో సమానంగా జీతం మాత్రం రాదు. కనీసం వాళ్ల జీవితంలో సగం కూడా ఉండకపోవటం, ఏ కష్టం వచ్చినా ఆరోగ్యానికి సంబంధించి ఇబ్బందులు ఎదురైనా సొంత డబ్బులతోనే వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితిలో వైద్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారు.వీరికి ప్రభుత్వ శాఖలో ఉద్యోగం అని చెప్పుకోవడమే కానీ ప్రభుత్వం నుండి ఏ విధమైన లబ్ది వీరికి చేకూరదు. సమాన పనికి సమాన వేతనం, దేశంలో ఉన్న కార్మికులందరికీ కనీస వేతన చట్టం అని మాటలన్నీ కేవలం నీటి మీద రాతలు గానే మిగిలిపోయి.వీరి జీవితాలలో కేవలం నిరాశ, నిస్పృహలు మాత్రమే మిగిలిపోతున్నాయి.పిల్లలను చదివించుకోవాలన్నా, వృద్ధాప్యంలో ప్రశాంతంగా గడపాలన్నా వీరికి భరోసా కరువైంది. 60 సంవత్సరాలు పైబడిన తర్వాత మరి ఏ ఇతర పని చేయలేకపోవడం,మరోవైపు ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం లేకపోవడం వల్ల వీరి శేష జీవితం అవసానదశలో అధ్వానంగా మారిపోయింది.

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: రెండు దశాబ్దాలకు పైగా వైద్యశాఖలో విస్తృతంగా సేవలు అందించిన కాంట్రాక్ట్ ఉద్యోగుల బ్రతుకులు దయనీయంగా మారిపోయాయి.పేరుకే ప్రభుత్వ ఉద్యోగం ప్రభుత్వ సహకారం వీరికి ఉండదు. ఎవరి ఉద్యోగాలు ఎప్పుడు ఉంటాయో, ఎప్పుడు ఊడిపోతాయో తెలియని పరిస్థితి. సరైన ఉద్యోగ భద్రత లేక దినదిన గండం నూరేళ్ల ఆయుష అన్నట్టుగా సాగుతుంది వీరి ఉద్యోగ ప్రయాణం. పాలకులు మారినా వీరి జీవితాల్లో వెలు గులు రాలేదు. కొత్త ప్రభుత్వం వస్తే మమ్మల్ని పట్టించుకుంటారు. ఉద్యోగం క్రమబద్ధీకరిస్తారని ఎన్నో ఆశలు పెట్టుకుని ఎదురుచూసిన ప్రతిసారి వీరికి నిరాశే ఎదురైంది. ప్రతి ఎన్నికల్లో పాలకులు మొండిచేయి చూపించగా పదవీ విరమణ సమయంలో ప్రభుత్వం కూడా అవే రిక్త హస్తాలు చూపిస్తుంది. ఎవరైనా పదవీ విరమణ పొందుతున్నారు అంటే ఆ కుటుంబంలో ఎంతో సంతోషం. స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులందరిని పిలుచుకొని పదవీ విరమణ సన్మాన సభ చాలా వైభవంగా నిర్వహించుకుంటారు. కానీ ఈ శాఖలో పదవీ విరమణ సమయం వచ్చింది అంటే చాలు ఎవరికీ చెప్పుకోలేనంత దుఃఖం. కళ్ళల్లో కన్నీళ్లు దాచుకుంటూ మౌనంగా విధుల నుండి నిష్క్రమిస్తున్నారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ పరిస్థితి ఇదే. పదవీ విరమణ అనంతరం వట్టి చేతులతో ఇంటికి వెళ్ళటమే కానీ ఒక రూపాయి కూడా రాదు అనేది నమ్మలేని చేదు నిజం. వైద్య ఆరోగ్యశాఖలో నమ్మకంగా పనిచేసిన తమ ఉద్యోగులకు ఎలాంటి ఉద్యోగ భద్రత ఇవ్వకుండా పనిచేసినంతకాలం కనీసం వేతనం కూడా అమలు చేయకుండా, ప్రయాణం, ఆరోగ్య భద్రత, ఇతర ఏ విధమైన సౌకర్యాలు కల్పించకుండా వెట్టి చాకిరి చేయించుకుని చివరికి ఇలా పదవీ విరమణ అయ్యాక పైసా కూడా ఇవ్వకుండా నిరాశతో ఉద్యోగులు వెనకకు తిరిగేలా చేయడం చూసి ▶మిగతా 2లో..

టిడ్కో గృహాలకు మోక్షం ఎప్పుడో?

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు నగర పరిధిలోని పోణంగి రోడ్డులో ఏడు సంవత్సరాల క్రితం ప్రారంభించిన టిడ్కో గృహాలు తమకు ఎప్పటికీ అందుతాయోనని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. 2014-19 కాలంలో పాలించిన టిడిపి ప్రభుత్వం టిడ్కో గృహాలు పథకాన్ని తీసుకొచ్చింది. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకానికి జతగా రాష్ట్ర ప్రభుత్వం కొంత నిధులను ఇచ్చి టిడ్కో గృహాల నిర్మాణాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఏలూరు నగర పరిధిలో 2200 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరిలో కొందరికి సింగిల్ బెడ్ రూమ్, మరికొందరికి డబుల్ బెడ్ రూమ్ ప్లాట్లు కేటాయించారు. అప్పట్లో వీరి వద్ద నుంచి ఒక్కొక్క లబ్ధిదారుని వద్ద నుంచి సరాసరిన 50 వేల రూపాయలు అధికారికంగానే వసూలు చేశారు. కొంతమంది లబ్ధిదారులకు ప్లాట్ నెంబర్లను కూడా కేటాయించారు. చాలా మంది పేద, బడుగు ,బలహీన వర్గాలు అట్టడుగు, అణగారిన వర్గాల ప్రజలు వడ్డీలకు తీసుకువచ్చి సొంతిల్లు వస్తుందన్న ఆశతో ఈ నగదును అడ్వాన్సుల రూపంలో చెల్లించారు. అప్పట్లో ఫ్లాట్లను కూడా వీరికి కేటాయించారు. ప్రభుత్వం మారిపోవడంతో టిడ్కో గృహాల నిర్మాణం నిలిచిపోయింది. ఈ కారణంగా పోణంగి రోడ్డులో ▶మిగతా 2లో..

రోడ్డు పనులను అడ్డుకున్న వైసీపీ, కూటమి నాయకులు

66 అడుగుల రోడ్డు వెయ్యాల్సిందే!

విశాలాంధ్ర - సీతానగరం : తమకు గ్రామ శివారు వరకు 66 అడుగుల మేరకు రహదారి నిర్మించి తమ గ్రామం నుండి కేవలం 34 అడుగులు రోడ్డు వేయడం ఏమిటంటూ రోడ్డు నిర్మాణ పనులను వైసీపీ, కూటమి పార్టీల నాయకులు అడ్డుకున్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం నుండి సీతానగరం మండలాన్ని అనుసంధానం చేస్తూ గత ప్రభుత్వంలో నూతనంగా 66 అడుగుల మేరకు అంటే డ్రైనేజీలు, డివైడర్, బర్మలు అన్ని కలిపి ఉండగా దీనిలో రోడ్డు 47 అడుగుల మేరకు రహదారి నిర్మించారు. రఘుదేవపురం హర్షవర్ధన పాఠశాల వరకూ రోడ్డు నిర్మాణ పనులను గత ప్రభుత్వం పూర్తి చేసింది. అప్పట్లో తమ స్థలాలు రోడ్డు నిర్మాణ పనుల్లో పోతున్నాయని, తమకు నష్టపరిహారం కావాలని కొంతమంది స్థానికులు కోర్టును ఆశ్రయించారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నష్ట పరిహారం సైతం చెల్లించలేని పరిస్థితి అప్పట్లో నెలకొంది. తాజాగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చెయ్యాలని భావించి రఘుదేవపురం రంగారావు కూడలి వద్ద నుండి కేవలం 34 అడుగుల మేరకు నిర్మాణం చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. దీంతో విషయం ▶మిగతా 2లో..

దాహం... దాహం

త్రాగునీటి కొరతతో అల్లాడుతున్న ప్రజలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సత్య సాయి తాగునీటి పథకం ద్వారా సరఫరా అయ్యే మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో పోలవరం, చింతలపూడి, గోపాలపురం నియోజకవర్గాలలోని ప్రజలకు తీవ్ర మంచినీటి కొరత ఏర్పడింది . గత మూడు రోజుల నుండి సత్యసాయి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు పంచాయతీ ద్వారా సరఫరా అయ్యే ట్యాంకర్ల నీటిని దాహార్తికి వినియోగిస్తున్నారు. హుకుంపేటలోని సత్యసాయి

తాగునీటి ప్రధాన పంపింగ్ హౌస్ ఉన్న ట్యాంకర్లు మరమ్మతులు చేయడంతో సరఫరాను నిలిపివేసినట్లు తెలిసింది. దీనిపై సంబంధిత శాఖ అధికారులు ముందుస్తుసమాచారం ఇవ్వకుండా నిలిపివేయడంతో మంచినీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు . ఆర్వో వాటర్ ప్లాంట్లలో తాగునీటిని కొనుగోలు చేసే స్తోమత లేక పంచాయతీ ద్వారా సరఫరా అయ్యే నీటిని త్రాగి దాహార్తి తీర్చుకుంటున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. సత్యసాయి తాగునీటి సరఫరా వెంటనే పునరుద్ధరించి, మంచినీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ధర్భరేవు డ్రైన్‌ను పూర్తి స్థాయిలో తవ్వాలి

విశాలాంధ్ర - నరసాపురం : ఏళ్ళ తరబడి పూడుకుపోయిన దర్భరేవు కొత్తకాయలతిప్ప డ్రైన్‌ను పూర్తి స్థాయిలో తవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ,ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల నాయకులు

కటకంశెట్టి మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పలువురు రైతులతో కలిసి కాలువ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ధర్భరేవు డ్రైన్ ఆధునీకరించి ఇరవై ఏళ్లయిందన్నారు. దీంతో పూడుకుపోయి మురుగునీరు, ముంపునీరు లాగక వేలాది ఎకరాలు ఒకపంట పండుతుంటే కొన్ని ప్రాంతాల్లో రెండుపంటలు పండే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలువ ఆధునీకరణకు సుమారు రూ. 45 లక్షల వరకు నిధులు మంజూరు చేశారన్నారు. కాలువ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ కాలువకు ఇరువైపులా మట్టితీసి మధ్యలో ఉన్న పూడిక తీయకపోవడంతో నీరులాగే పరిస్థితి లేదన్నారు. తక్షణమే పంటు ఏర్పాటు చేసి కాలువ మధ్యలో నుండి మట్టి తవ్వాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి ధర్భరేవు నుండి కొత్తకాయలతిప్ప వరకు ఆదునీకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో రైతులు సంగాని వెంకటేశ్వరరావు, గుబ్బల శ్రీను, కటకంశెట్టి వెంకటేశ్వరరావు, జుత్తిగ హనుమంతరావు, కడలి తాతయ్య, పోతాబత్తుల నర్శింహరావు, కడలి తాతయ్య పాల్గొన్నారు.

దేశభక్తిపై జిల్లా స్థాయి పోటీలు

విశాలాంధ్ర -భీమవరం: 74వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు దేశభక్తిని ప్రేరేపించేలా జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నామని శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు.

శుక్రవారం వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశభక్తిని అన్ని వర్గాల్లో ప్రేరేపించేలా జిల్లాస్థాయిలో మహిళా సంఘాలు, విద్యార్థులకు, మెప్మా మహిళలకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తామని తెలిపారు.

11,12,13 తేదీల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులకు పోటీలు జరుగుతాయని, గెలుపొందిన వారికి 17న జరిగే ముగింపు వేడుకల్లో బహుమతులను అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 99123 22269కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మమేకమవ్వాలి
(1వ పేజీ తరువాయి)

తగిన ప్రాధాన్యత చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం, పింఛను, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు మొదలైన పథకాలు అందలేదని లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా ఫిర్యాదులను తక్షణమే స్వీకరించి, వాటి యధార్థ స్థితిని పరిశీలించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలందించడంలో జాప్యం చోటుచేసుకోకూడదని స్పష్టం చేశారు. ప్రతి అర్హత కలిగిన లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నూరు శాతం అందాల్సిన బాధ్యత తమపై ఉందని కలెక్టర్ గుర్తు చేశారు. పౌర సేవల నాణ్యతను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ వెంట ఆర్ఎంసి అధికారి శైలజవల్లి, డీఆర్డిఏ పిడి ఎన్వివిఎస్ మూర్తి, పిడివోలు పాల్గొన్నారు.

కూటమి నాయకులు
(1వ పేజీ తరువాయి)

తెలుసుకున్న గ్రామస్తులు, ప్రతిపక్ష నేతలు సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం అడ్డుకున్నారు.

13 అడుగులు వ్యత్యాసం వస్తుందని మండిపడ్డారు. దీనిపై ఈ వ్యత్యాసానికి ప్రభుత్వం నుండి ఎప్పుడైనా నష్టపరిహారం చెల్లింపులు జరిపితే వెంటనే రోడ్డు వెడల్పు చేసే విధంగా ముందస్తు చూపుతో రోడ్డు నిర్మాణం జరుగుతుందని అధికారులు చెప్పారు. దీనిపై ఏఈ వీరన్న బాబును వివరణ కోరగా పనులు నిలిపివేసిన సమాచారం పై అధికారులకు తెలిపామన్నారు. తమ గ్రామం నుండి కూడా పూర్తి స్థాయిలో రహదారి పనులు నిర్మాణం చేపట్టాలని, అన్ని భద్రత చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

మోక్షం ఎప్పుడో?
(1వ పేజీ తరువాయి)

టిడ్కో గృహాలు మొండి గోడలుగా నిలిచిపోయాయి. ఆయా గృహాలలో పాముల పుట్టలు ఉన్నాయి. ఇళ్ళ ముందు తుప్పలు, పిచ్చి మొక్కలు, పెద్దపెద్ద తుమ్మ చెట్లు ఉన్నాయి. ఇక్కడ వాతావరణం కీకారణ్యాన్ని తలపిస్తోంది. రోడ్లు, డ్రైన్లు వీధి దీపాలు, శానిటేషన్ వంటి సౌకర్యాలు ఏర్పాట్లు అప్పట్లోనే ఆగిపోయాయి. నాలుగు అంతస్తుల వరకు ఉన్న సుమారు 20 అపార్ట్మెంట్లు మొండి గోడలుగా మిగిలిపోయాయి.

కొన్ని అపార్ట్మెంట్లలో ఇనప ఊచలు బయటకు వచ్చి కనిపిస్తున్నాయి. లబ్ధిదారులకు కేటాయించిన ఫ్లాట్ లోకి వెళ్లేందుకు అవకాశం లేని పరిస్థితి ఉంది. గుమ్మాలలో పెద్దపెద్ద చెట్లు మొలిచాయి అంటే అక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.ఎన్నికల ముందు టిడ్కో గృహాలు అధికారులకు రాగానే అప్పగిస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచిన ఇంతవరకు వాటి గురించి పాలక పార్టీ పట్టించుకోకపోవడంపై లబ్ధిదారుల నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతోంది. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు కేటాయించిన ఫ్లాట్ ల నిర్మాణాన్ని పూర్తి చేసి ,మౌలిక సౌకర్యాలు కల్పించి గృహాలను తమకు అప్ప చెప్పాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆగని కన్నీళ్లు
(1వ పేజీ తరువాయి)

పలువురు వైద్య శాఖ ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు.

నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా...

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వైద్య సేవలు అందించాలని కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్‌ను ప్రారంభించింది. 2005 ఏప్రిల్ 12న రూరల్ హెల్త్ మిషన్, 2013 మే 1న నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ఏర్పాటు చేసింది.

2005లో ప్రతి గ్రామానికి కనీసం ఒక ఏఎన్ఎం, అదనంగా సెకండ్ ఏఎన్ఎంలను కాంట్రాక్టు పద్ధతిలో నియామకం చేశారు. ఇది ముఖ్యంగా సుదీర్ఘంగా సేవలు అందించే ఏఎన్ఎంలను కలపడం కోసం రూపొందించబడింది. ఈ పథకం కింద ప్రధానంగా ఆరోగ్య వ్యవస్థ బలోపేతం చేయటం, ఉప కేంద్రాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సేవల పెరుగుదలే లక్ష్యంగా పనిచేయడం ప్రారంభించారు. గ్రామంలో ఇలాంటి ఆరోగ్య సేవలు విస్తరించడం వలన రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, బిడ్డల ఆరోగ్య సంరక్షణ ప్రణాళికలు పెరిగాయి. గర్భిణీలు, శిశువులు, బాలల ఆరోగ్యం మెరుగుపడింది. వీరికి తోడు గ్రామాలలో ఆశా వర్కర్లను నియమించడం ద్వారా ఆరోగ్య పరిస్థితులను మరింత పెంపొందింపజేశారు. తద్వారా అంటువ్యాధులు ఇతర వ్యాధుల పట్ల ప్రజలకు మరింత అవగాహన పెరిగింది. ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఆరోగ్యం గూర్చిన అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు.

టి.బి., మలేరియా, కుష్టు వంటి వ్యాధుల పట్ల అవగాహన, నియంత్రణ చర్యలు పెరిగాయి.వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడం, ఉచితంగా మందులు ఇవ్వడం పెద్ద రోగాలకు కూడా చికిత్స అందించే స్థాయికి వెళ్లడం జరిగింది. గర్భిణుల పట్ల, అప్పుడే పుట్టిన శిశువుల పట్ల మరింత శ్రద్ధ తీసుకోవడం ప్రారంభమైంది. గ్రామాలకు అనుబంధంగా ఉన్న సుదూర ప్రాంతాలకు కూడా వీరి సేవలు విస్తరించి ప్రజలలో ఆరోగ్య సంరక్షణ చర్యలు పెరిగాయి. ఇప్పటికీ ఈ సేవ కొనసాగిస్తూనే ఉన్నారు.

కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి

ఆర్థిక సంస్కరణలకు ప్రాధాన్యతను ఇచ్చే ముఖ్యమంత్రి చంద్రబాబులో మరో లక్షణం కూడా ఉంది. ఉద్యోగుల పట్ల కాస్తంత ఉదారతగా వ్యవహరించే గుణమే అది. 2014లో విభజిత రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ఈ జాతీయ హెల్త్ మిషన్లో కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఏటా10శాతం జీతం పెంచుకుంటూ వెళ్లారు.ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పెంపుదల మాట దేవుడెరుగు నెల నెలా జీతం ఇస్తే చాలు అన్న అభద్రతతో బతికారు.మళ్లీ కూటమి పాలనతో చంద్రబాబు గద్దెనెక్కి ఏడాది అయినా వీళ్ళ జీతాలపై దృష్టి సారించలేదు. అందరిని క్రమబద్ధీకరిస్తామని చెప్పిన ఏ పార్టీ కూడా మాట నిలుపుకోలేదు. కనీసం సీనియారిటీని బట్టి వేతనం పెరుగుదల జరుగుతుందన్న ఆశతో ప్రస్తుతం కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు.

ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వైద్యశాఖలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగుల పట్ల కనీస వేతన చట్టాన్ని అమలు చేసి,ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, పదవీ విరమణ అనంతరం కనీసం కొంత మొత్తంలో నగదు అందించే ప్రణాళికలు, చట్టాలు చేసి వీరి జీవితాలలో వెలుగులు నింపాలని ఉద్యోగుల కుటుంబాలు కోరుకుంటున్నాయి.

మున్సిపల్ రెవెన్యూ అధికారిగా మురళీధర్

విశాలాంధ్ర - నరసాపురం: నరసాపురం మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్, ఇన్‌చార్జి మేనేజర్‌గా గుణ్ణం మురళీధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆంధ్ర ప్రదేశ్ కమిషనర్, డైరెక్టర్ పురపాలక పరిపాలన శాఖ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ పదవులలో నియమించినట్లు కమిషనర్ ఎం. అంజయ్య తెలిపారు. బాధ్యతలు చేపట్టిన మురళీధర్ ను సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడకుండా

సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర- చింతలపూడి : ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడకుండా సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి ఏరియా హాస్పిటల్‌లో గైనకాలజిస్ట్ కోసం ఎప్పటినుంచో

ఎదురుచూస్తున్న ప్రజలకు శాసనసభ్యుల చొరవతో నూతన గైనకాలజిస్ట్ వల్లూరు హర్షిత నియమితులయ్యారు. ఈ సందర్భంగా చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతనంగా నియామకమైన గైనకాలజిస్ట్ డాక్టర్ వల్లూరి హర్షిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు రోషన్ కుమార్ గారు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే వైద్యులకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలు ఎవరూ కూడా ఇబ్బందులు పడకుండా సకాలంలో వైద్యం అందించి, ఎరుగైన సేవలు అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండ్రు దేవా , గుమ్మిశెట్టి భారతి పాల్గొన్నారు.

ప్రజలు మలేరియా బారిన పడవద్దు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తపల్లి సచివాలయ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఫ్రైడే డ్రై డే సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గణపవరం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది విల్సన్ బాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమల

బారిన పడకుండా ఇంటి ప్రక్కల తడి లేకుండా పొడిగా ఉంచుకొనుట ద్వారా దోమలు పుట్టవని, దోమలు కుట్టుట ద్వారా వచ్చే మలేరియా, డెంగు ,చికెనుగునియా. వ్యాధులు అరికట్ట వచ్చునని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఎస్ఎం బాలమురళీ కృష్ణ , ఏఎంఎయు మేరీ, రత్నం, ఎం నల్లయ్య, ఆశా కార్యకర్త ప్రభావతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర -భీమవరం: పెదగరువు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాలతో పాటు ఆక్వా, చేపల చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సైబర్ సెక్యూరిటీలో అపార అవకాశాలు

విశాలాంధ్ర -భీమవరం: సైబర్ సెక్యూరిటీలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు రియల్ టైం అప్లికేషన్స్ పై అవగాహన పెంచుకోవాలని డీఎన్నార్ విద్యా సంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ గాదిరాజు బాబు అన్నారు. డీఎన్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో రెండు రోజులుగా జరుగుతున్న సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాపు ముగింపు సందర్భంగా రాపిడ్ స్కిల్ సంస్థ రిసోర్స్ పర్సన్స్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా మరిన్ని వర్క్ షాపులు నిర్వహించడానికి కృషి చేస్తామని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అంజన్ కుమార్ మాట్లాడుతూ అకాడమిక్ సబ్జెక్టుతో పాటు కాన్సెప్ట్ ఓరియెంటెడ్ టెక్నాలజీలలో కూడా విద్యార్థులు నైపుణ్యం సాధించాలని దానికి వర్క్ షాప్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.సత్యనారాయణ, డాక్టర్ కే.వేణుగోపాల్, డాక్టర్ జగపతి రావు, ఎల్.బుజ్జి, టి.ఆర్.ఎస్.ప్రసాద్, కే.నందన్ కుమార్, కే.వెంకన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర-ఏలూరు: గ్రామాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. పెదపాడు మండలం పెదపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రైన్ల నిర్మాణ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వయంగా తానే రంగంలోకి దిగి స్థానిక కాలనీలో స్థితిగతులను స్వయంగా పరిశీలించారు. శనివారం నాడు ఈ అంశంపై అధికారులు సిబ్బందితో సమీక్షించి త్వరితగతిన కాలనీలో సమస్యల పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడతామని కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. అనంతరం చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైన్లు, రోడ్ల సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పరిష్కరిస్తున్నామని,డ్రెయిన్ల మరమ్మత్తులు చేపట్టడంతో పాటు గ్రామాల్లో ఉన్న కాలనీలో పూర్తి అధ్వాన స్థితిలో ఉన్న డ్రైన్లను, సుపరిపాలలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

పేదలకు ఇళ్ళ పట్టాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: ఎర్ర చెరువు కాలనీలో నివాసం వుంటున్న పేదలకు ఇళ్ళ పట్టాలు మంజూరు చేయాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, పశ్చిమ గోదావరి జిల్లా బిసి విభాగాల కో ఆర్డినేటర్ కొండపల్లి రవి కోరారు. నూజివీడులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ ,సమాచారం పబ్లిక్ రిలేషన్స్ శాఖామాత్యులు కొలుసు పార్థసారథిని కలిసి టి నరసాపురం ఎర్రచెరువు ప్రాంతంలో నివాసం వుంటున్న పేదలకు ఇళ్ళ పట్టారు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో నిర్మాణం జరిగిన గృహాలకు వైసిపి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకుండా ఆపివేసిందని ఆయన తెలిపారు.దానివలన ఎంతోమంది పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని త్వరితగతిన బిల్లులు మంజూరు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ప్రాంతీయ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సర్వసభ్య సమావేశం జగన్నాథపురం గ్రామంలో జరిగింది. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న శానిటరీ, అర్హత గల సెమీ స్కిల్డ్, స్కిల్డ్ కార్మికులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. వారానికి ఒక రోజు సెలవు (వీక్లీ ఆఫ్), నిబంధనల మేరకు పని గంటలు, జీతాల జాప్యం, ఈఎస్ఐ, ఈపీఎఫ్ లాంటి కార్మిక హక్కుల అమలు కోసం ఇతర సమస్యలపై, అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, కార్మికుల న్యాయమైన డిమాండ్లను సాధించడమే కాకుండా, వారి హక్కులను రక్షించేందుకు యూనియన్‌ను బలోపేతం చేయాలని తీర్మానించారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా యూనియన్ కార్యకలాపాలను విస్తరింప చేయాలని నిర్ణయం తీసుకొని,దశల వారీగా ఆందోళన, పోరాటాలు చేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశానికి యూనియన్ అధ్యక్షులు తాడేపల్లి సుబ్బరాజు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసు, ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా అధ్యక్షులు ఓవి రాజు, ప్రధాన కార్యదర్శి ఎం.హరీష్, కార్యనిర్వాహక అధ్యక్షులు కళింగ లక్ష్మణరావు హాజరై కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికుల ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే బాధ్యత యూనియన్ తీసుకుంటుందని,పెద్ద ఉద్య మంగా మారుస్తామని అన్నారు. కార్మికుడి చివరి హక్కు సాధించేవరకు యూనియన్ వారి వెన్నంటి నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలకు చెందిన వందమంది కార్మికులు హాజరయ్యారు.

ఎంపీ మహేష్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు: వెలకట్టలేని ఆప్యాయత, అందమైన అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. సొంత అన్నలా, తమ్ముడిలా తనను ఆదరిస్తున్న ఏలూరు పార్లమెంటు నియోజకవర్గంలోని అక్క చెల్లెళ్ళు అందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్.

మొదటి నుంచి మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చే తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని కూడా మరి కొద్ది రోజుల్లోనే అమలులోకి తీసుకురానున్నదన్నారు.

బధిరోన్నత పాఠశాల వార్షికోత్సవంలో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే పులపర్తి

విశాలాంధ్ర -భీమవరం: శ్రీవెంకటేశ్వర బధిరోన్నత పాఠశాల 40వ వార్షికోత్సవ వేడుకల్లో అందరూ భాగస్వాములు కావాలని, తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు అన్నారు. బధిరోన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, బధిర క్రీడాకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న నిర్వహించబోయే 40వ వార్షిక వేడుకలకు సహకారం అందించా లని కోరుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యేకు నిర్వాహకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీటీడీ నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో అనేక మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని, వారందరిని కూడా ఈ వేడుకల్లో సత్కరించుకోవడం గొప్ప విశేషమని ఎమ్మెల్యే అన్నారు. వార్షికోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు చెరుకువాడ రంగసాయి, అధ్యక్షులు సి. హెచ్. తాతారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఈ పాఠశాలలోని పూర్వ విద్యార్థులు జీవనోపాధి సాగిస్తున్నారని అన్నారు. సెప్టెంబర్ 10వ తేదీన శ్రీ వెంకటేశ్వర బధిరోన్నత పాఠశాల

40వ వార్షికోత్స వాన్ని డిఎన్నార్ రామకృష్ణ సభ భవనంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 400 మంది పాల్గొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో వేడుకల సభ్యులు గొట్టుముక్కల శ్రీనివాస్ రాజు, రామచంద్ర రావు, జి. గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, జి.అప్పల స్వామి, పొత్తూరి బాపిరాజు, పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ, కొప్పినిడి బాబీ, రెడ్డి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం

విశాలాంధ్ర-ఏలూరు: ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు ఏలూరు బ్రాంచిలో బ్యాంక్ సభ్యుల కుటుంబాల నుండి ప్రతిభ కనబరచిన పిల్లలకు ఎస్.ఎస్.సి., ఇంటర్ ఫలితాలలో 90శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు బ్యాంకు డైరెక్టర్లు, కమిటీ సభ్యులు,నగదు పురస్కారం అందజేశారు. బ్యాంకు బ్రాంచి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 10 తరగతి విద్యార్థులకు 4గురికి ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున రూ.20 వేలు,ఇంటర్ విద్యార్థులు 8 మందికి రూ.7500 చొప్పున రూ.60 వేలు మొత్తం రూ.80 అందజేశారు.ఈ సందర్భంగా బ్యాంకు డైరెక్టర్ సిహెచ్ కోటేశ్వరరావు, పివి రమణ, ఎన్.అంజయ్య, మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి విద్యఅభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

వివిధ వృత్తులలో యూనియన్ బ్యాంక్ శిక్షణ

విశాలాంధ్ర -ఏలూరు: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, సత్రంపాడులో ఈనెల 18వ తేదీ నుండి ఉచితంగా సిసి టి.వి.కెమెరా రిపేరింగ్ 13 రోజులు (పురుషులకు), పుట్టగొడుగుల పెంపకం 10 రోజులు (మహిళలకు, పురుషులకు), బ్యూటీ పార్లర్ 31 రోజులు (మహిళలకు), శిక్షణ ఇవ్వబడుతుందని సంస్థ డైరెక్టర్ ఎం.ఫణి కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో భోజనం, హాస్టల్ వసతి పూర్తిగా ఉచితమని, శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా టూల్ కిట్టు ఇవ్వబడుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు బ్యాంకు నుండి సర్టిఫికెట్, అర్హులైన అభ్యర్థులకు ముద్ర లోనుకు సిఫారసు చేయనున్నట్టు తెలిపారు. వివరముల కోసం నంబర్లను 9948565256,9502723561 సంప్రదించవచ్చన్నారు.

ఘనంగా తీజ్ పండుగ

విశాలాంధ్ర-టి నరసాపురం: టి నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురం గ్రామంలో బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో గోర్ బంజారాలోని పెళ్లికాని ఆడ బిడ్డలు తొమ్మిది రోజుల పాటు జరుపుకునే తీజ్ పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలంతా పాడి పంటలు సిరి సంపదలతో పాటు సుఖ సంతోషాలతో అభివృద్ధి చెందాలని కోరుకుంటూ భక్తి శ్రద్ధలతో నిర్వహించే పండుగ తీజ్ అన్నారు. సంఘ అధ్యక్షులు మూడు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ఆడపిల్లలు పుట్టింటికి, మెట్టినింటికి కీర్తి ప్రతిష్టలు తెచ్చేలా వారిలో నైతిక, సామాజిక విలువలను నేర్పుతూ, వారిలో మనోధైర్యంతో జీవించే లక్షణాలను పెంచుటకు తీజ్ పండుగ ఉపయోగపడు తుందని అన్నారు. సంఘ కోశాధికారి ధరావతు రవి నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారా ఆడబిడ్డల కలలను, ఆశలను తీజ్ ఫలింపజేస్తుంది అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉండే గోర్ బంజారా ఆడబిడ్డలు ఈ పండుగను చేసుకుంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశావత్ వెంకట్, భూక్యా సత్యం, భూక్యా ధనలక్ష్మి, జరభల కృష్ణ లీల, భూక్యా సునీల్, గుగులోతు బాబు, లావుడియా సంధ్య, జరభల పద్మ, భూక్యా భద్రమ్మ, భూక్యా వెంకమ్మ. భూక్యా నీరజ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

విశాలాంధ్ర-ఏలూరు: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం కోటరామచంద్రాపురంలోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించనున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి రాములు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం ఉదయం గం.9లకు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

దసరా ఉత్సవాల పై సమీక్ష

విశాలాంధ్ర -నూజివీడు :నూజివీడు పట్టణంలో జరిగే దసరా ఉత్సవాల పై పట్టణ కిరాణా మర్చంట్ అసోసియేషన్ హాలులో అధికారులు, నాయకులు, కమిటీ సభ్యులతో,రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఏడాది జరిగే విధంగా ఘనంగా నిర్వహించాలని

అధికారులకు ఆదేశించారు.మైసూర్ ఉత్సవాలు తలపించేలా నూజివీడు ఉత్సవాలు నిర్వహించాలని మంత్రి నాయకులకు, అధికారులకు సూచించారు. దసరా ఉత్సవాల్లో ఎటువంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా,పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్,వైద్య,తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు, త్రాగునీరు,అందుబాటులో ఉంచాలని, మెడికల్ క్యాంపు నిర్వహించాలని, నాయకులు, ప్రభుత్వ యంత్రాంగం, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి దసరా పండుగను విజయ వంతం చేయాలని మంత్రి అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పి, సత్యనారాయణ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఆర్, మురళీ కృష్ణ కుమార్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎమ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్లు క్రమబద్ధీకరణ చేసుకోండి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం:పట్టణంలో ఉన్న అనధికార లేఔట్‌లు, ప్లాట్లు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఉత్తర్వులు ఇచ్చిందని

మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ అయిన భూములకు మాత్రమే ఈ ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. క్రమబద్ధీకరణకు జూలై 26 నుండి 90 రోజుల వరకు అవకాశం ఉన్నందున ప్రభుత్వ నిబంధనలు అనుసరించి అర్హత ఉన్నవారు క్రమబద్ధీకరణ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సూచించారు.

ఘనంగా వరలక్ష్మి వ్రతం

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలో శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఇంటింటా పండగ వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహిళలు పసుపు కుంకుమలను సమర్పించారు. ఇళ్లలో అమ్మవారి బొమ్మలను

నెలకొల్పి ప్రత్యేక పూజలు చేశారు. పలు రకాల పిండి వంటలను వండి నైవేద్యంగా సమర్పించారు.

కొయ్యలగూడెంలో : వరలక్ష్మీ వ్రత వేడుకలను ప్రజలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండలంలో నరసన్న పాలెం గ్రామ శివారు వై జంక్షన్ ఆలయం లోని కనకదుర్గమ్మను నోట్ల కరెన్సీ తో అలంకరించి ధనలక్ష్మి రూపంలో భక్తులు కొలిచారు. బయ్యనగూడెం, కొయ్యలగూడెం, కన్నాపురం,

గవరవరం, పలు గ్రామాలలోని కనకదుర్గమ్మ ఆలయాలలో మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద లలితా సహస్రనామ కోటి నారాయణ లో మహిళా భక్తులు వందమందికి పైగా పాల్గొన్నారు. టెంపుల్స్ సెంటర్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వరలక్ష్మీ వ్రతాలను ఆచరించిన మహిళలు తమ భర్తలకు కంకణాలు కట్టి ఆశీస్సులు అందుకున్నారు.

ఏపీలో ఇ-కోర్టుల అమలుకు తీసుకున్న చర్యలేంటి

ఎంపీ మహేష్

విశాలాంధ్ర - ఏలూరు : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఈ-కోర్టుల అమలుకు తీసుకున్న చర్యలేంటని పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా లోక్ సభలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్

అడిగిన ప్రశ్నకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. దేశంలోని న్యాయ స్థానాలన్నింటిలో సాంకేతిక సౌకర్యాలు కల్పించి "ఈ-కోర్టులు"గా మార్చే ప్రక్రియలో భాగంగా సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కమిటీతో సమన్వయం చేసుకుంటూ "ఈ-కోర్టులు" ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఈ-కోర్టుల ద్వారా ఇప్పటివరకు రూ.18.57 లక్షల కేసులు విచారణ జరిగాయని, ఎన్ఎస్టిఈపి సాంకేతిక వ్యవస్థ ద్వారా సమన్ల జారీని సులభతరం చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటికే 188 న్యాయస్థానాలకు 10 నుంచి ఎంబిపిఎస్ తో కూడిన డబ్ల్యుఏఎన్ నెక్టివిటీ ఇచ్చామని చెప్పారు.

ఈ-కోర్టు ప్రాజెక్టులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫేజ్ 1, 2 లో హైకోర్టుతో పాటు 598 ఉప కోర్టులు ఈ ప్రాజెక్టు పరిధిలోకి తీసుకురాగా మరో 51 కోర్టులలో కూడా సాంకేతిక సౌకర్యాలు కల్పించే పని జరుగుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 649 కోర్టులు ఈ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 48 కోర్టులు ఈ ప్రాజెక్టు కింద అనుసంధానించ బడ్డాయని కేంద్ర మంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టు కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటివరకు 3,831 మంది న్యాయాధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు, 8.4 కోట్ల కోర్టు రికార్డులు డిజిటల్ చేయబడినట్లు కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ వెల్లడించారు. ఈ-కోర్టు ప్రాజెక్టు కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.75 కోట్లకు పైగా ఖర్చు చేయగా మరో రూ.15.8 కోట్ల నిధులను విడుదల చేశామని మంత్రి తెలిపారు.

జాలిపూడి పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లించాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: జాలిపూడి పంచాయతీ కార్మికుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐ టియుసి) డిమాండ్ చేసింది.ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశం శుక్రవారం ఏఐటియుసి కార్యాలయం నందు ఏఐటియుసి జిల్లాఅధ్యక్షులు ఆర్ శ్రీనివాస్ డాంగే అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)జిల్లా కార్యదర్శి పి కిషోర్ మాట్లాడుతూ ఏలూరు రూరల్ మండలం జాలిపూడి పంచాయతీ సిబ్బందికి గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని వెంటనే ఆ సిబ్బందికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.అసలే చాలీచాలని జీతాలతో బ్రతుకుతున్న పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోతే ఏ విధంగా పనిచేస్తారని వారు ప్రశ్నించారు. ఇప్పటికే ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. కార్మికులకు బకాయి జీతాలు చెల్లించని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో గ్రామపంచాయతీ

కార్మికులు చాలీచాలని అతి తక్కువ వేతనాలతో బతికిదుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.పిఎఫ్, ఈఎస్ఐ కనీస సౌకర్యాలు సైతం అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె,చెప్పులు,చేతి గ్లౌజులు,యూనిఫామ్ తదితర కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

రోడ్డుకు మరమ్మతులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : 'ప్రమాదాలకు నిలయం జాతీయ రహదారి' అనే కథనం గత నెలలో విశాలాంధ్ర పత్రికలో వెలువడడంతో జాతీయ రహదారి అధికారులు స్పందించారు. మూడు సంవత్సరాల క్రితం తల్లాడ నుండి దేవరపల్లి వరకు నిర్మించిన జాతీయ రహదారి పై రోడ్డు పొలం గట్టుల వలే మట్టి పేరుకుపోవడంతో, వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈ విషయంపై

విశాలాంధ్ర పత్రికలో వెలువడిన శీర్షికకు జాతీయ రహదారుల అధికారులు స్పందించి, మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో జెసిబి సహాయంతో రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే బడేటి చంటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా పని చేస్తున్నానని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి భరోసా ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించినప్పుడు వచ్చిన సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం చూపుతున్నారు. నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో ముగ్గురు విద్యార్థినిలు చదువు అవసరం నిమిత్తం ల్యాప్ టాప్ లు అడిగారు. చిరు వ్యాపారులు ఉపాధి నిమిత్తం తోపుడు బండ్లు అందజేయాలని కోరారు. వారి సమస్యను విన్న ఎమ్మెల్యే శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ముగ్గురు విద్యార్థినిలకు ల్యాప్‌టాప్‌లు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం చేయడం ద్వారా వారు అభ్యున్నతి చెందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు గొండ్వానా దండకారణ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మడకం వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం పురస్కరించుకుని శనివారం పి అంకంపాలెం ఆయన పొలం వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివాసి దినోత్సవాన్ని ప్రతిసంవత్సరం ఆగస్టు9వతేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. 1982 ఆగస్టు 9న జెనీవాలో అటవీ వనరుల

హక్కులకు సంబంధించి సమస్యలపై 26 మంది మానవ హక్కుల మేధావులతో వర్కింగ్ గ్రూపుల సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశంలో 140 దేశాలప్రతినిధులు పాల్గొన్నారన్నారు. ఆదివాసీలకోసం కూడా ఒకరోజు ఉండాలని ఐక్యరాజ్యసమితిని కమిటీ కోరగా ఆదివాసీల సంరక్షణ చట్టాలకు ఐక్యరాజ్యసమితి ఆమోదం తెలిపిందని అన్నారు. ఈ కమిటీ 1992 నుండి పది సంవత్సరాలుపాటుప్రపంచవ్యాప్తంగా తిరిగి ఆదివాసి సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి విశ్లేషణ చేసి 1994 నుండి 2014 వరకు ఆ మధ్య కాలాన్ని ఆదివాసీల అభివృద్ధి కాలంగా పరిగణించి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం గా ప్రకటించడం జరిగిందని ఆయన తెలిపారు. ఆదివాసి దినోత్సవం సందర్భంగా గిరిజన నాయకులు స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్న మహనీయుల చిత్రపటాలకు బిరసా ముండా, కొమరంభీమ్, రాంజీగొండ్, పూలమాలవేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

కారుణ్య నియామక పత్రం అందజేత

విశాలాంధ్ర – రాజమండ్రి సిటీ : సిజిఆర్ మునిసిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూల్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తూ మృతి చెందిన మందాలపు నాగలక్ష్మి భర్తకి కారుణ్య నియామక పత్రం ఇస్తూ జిల్లా కలెక్టర్, కమిషనర్(ఎఫ్.ఎ.సి) పి.ప్రశాంతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పండె నాగ బాబుకి జూనియర్ అసిస్టెంట్‌గా కారుణ్య నియామకపత్రం ఇవ్వటం జరిగిందన్నారు. క్రమ శిక్షణతో, అంకితభావంతో అప్పగించిన విధులు నిర్వర్తించి, తాము పనిచేస్తున్న అధికారుల మన్ననలు పొందాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

నోట్లతో అమ్మవారికి అలంకరణ

విశాలాంధ్ర – కడియం : తూర్పుగోదావరి జిల్లా, కడియం మండలం, కడియపులంక గ్రామంలో, శ్రీ పుంతలో ముసలమ్మని రూ. 30 లక్షల నోట్లతో అద్భుతంగా అలంకరించారు. శ్రావణమాసం వరలక్ష్మి దేవి వ్రతం సందర్భంగా శుక్రవారం ఈ అమ్మవారికి అలంకరణ జరిగింది. ధనలక్ష్మి అమ్మవారిగా శ్రీ ముసలమ్మ వారు దర్శనమిస్తున్నారు. సిరులను కురిపించే ధనలక్ష్మి దేవిగా కొత్త నోట్లతో అమ్మవారు కళకళలాడి పోతున్నారు. ఈ అమ్మవారిని దర్శించుకోవడానికి శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు క్యూ కడుతున్నారు.

పీఎం సోలార్ గర్ పథకం సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-దేవరపల్లి: ప్రధానమంత్రి సోలార్ గర్ పథకాన్ని ఎస్సీ, ఎస్టీ వర్గాలు వారు వినియోగించుకోవాలని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సోలార్ గర్ పదకంవలన ఎస్సీ ఎస్టీ వర్గాల వారు2 కె.వి విద్యుత్తును వినియోగించు కోవచ్చని తెలిపారు. నెలకు రూ.200లు ఇంటి అద్దె చొప్పున సంవత్సరానికి రూ. 2400 ఎస్సీ ఎస్టీ వర్గాల వారికి కేంద్ర ప్రభుత్వం ద్వారా అందజేయడం జరుగుతుందని దుర్గారావు అన్నారు దేవరపల్లి మండలంలో 4500 మంది ఎస్సీ ఎస్టీ వర్గాల గృహాలు ఉన్నాయని తెలిపారు ప్రధాన మంత్రి సోలార్ పథకానికి ఆధార్ కార్డు కరెంట్ బిల్లు జిరాక్స్ బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలను దేవరపల్లి ఎర్రగూడెం ట్రాన్స్కో ఏఈలకు అందజేయాలని తెలిపారు. ఇదేవిధంగా ఎస్సీ ఎస్టీ వర్గాల ప్రజలకు 200 యూనిట్లు విద్యుత్తు ఉచితంగా అందించటం జరుగుతుందని తెలిపారు ఈ పథకాన్ని ఎస్సీ ఎస్టీ వర్గాల గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దుర్గారావు కోరారు.

ఎమ్మెల్యేపై విమర్శలు తగదు

విశాలాంధ్ర – రాజమండ్రి సిటీ : వైసీపీ పాలనలో కార్మికులకు అన్యాయం జరిగితే అప్పుడు అదేపార్టీలో ఉన్న బొజ్జ రామకృష్ణ ఏం మాట్లాడకుండా ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను విమర్శించడం మంచి పద్ధతి కాదని టిఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాళ్ళ శ్రీనివాసరావు హితవు పలికారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గోదావరి ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడినని చెప్పుకునే బొజ్జ రామకృష్ణ అసలు ఎలక్ట్రికల్ పని నేర్చుకున్న కార్మికుడే కాదని, అతడికి పని నేర్పించిన గురువు ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలోనే సంక్షేమ బోర్డు రద్దు చేశారని తెలియదా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో ఇసుక దొరక్క, పనులు లేక భవన నిర్మాణ కార్మికులు పస్తులు ఉన్నారని, కల్తీ మద్యం వల్ల ఎన్నో వేలమంది కార్మికులు చనిపోయారని అప్పుడు బొజ్జ రామకృష్ణ ఏం చేశాడని యాళ్ళ శ్రీనివాసరావు నిలదీశారు. అతని స్థాయికి మించి సీఎం, డిప్యూటీ సీఎం, కార్మిక శాఖ మంత్రిని, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను విమర్శించడం సమంజసం కాదని హితవు పలికారు. క్లైములు పరిష్కారం చేస్తే అందులో బొజ్జ రామకృష్ణ రూ. 3వేలు, రూ. 4 వేలు కమీషన్లు లాగుతాడని ఒక మహిళ అతడి ముఖం మీదే తిట్టిందని యాళ్ళ శ్రీనివాసరావు అన్నారు. రాజమండ్రి రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎంఆర్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ బొజ్జ రామకృష్ణ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో రాజమండ్రి ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పత్తి శివ, కోశాధికారి కొండపల్లి సతీష్ కుమార్, స్టాండింగ్ కమిటీ చైర్మన్ చింతపల్లి బోసు, సభ్యులు గోపి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

విశాలాంధ్ర, కొవ్వూరు : జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, రైతు సంఘం సభ్యులు కే. వి. కే. రంగారావు అన్నారు. సార్వా వరికి నీరు పెట్టిన 30 రోజుల్లో ఎరువులు వేయాలని సుమారు 50 రోజులైనా యూరియా కొరతతో కొన్నిచోట్ల మందులు వేయటం కుదరట్లేదు. ఆలస్యంగా వేయడం వలన ప్రయోజనం ఉండదని సార్వా పరిస్థితి ఇలాగే ఉంటే దాళ్వా వరి పంటకు ఇంకా ఎక్కువ యూరియా వినియోగించాల్సి వస్తుందని, ఈ పరిస్థితి ఊహించి రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది అవసరానికి మించి యూరియా బస్తాలు నిల్వ చేయడం వలన ఈ పరిస్థితి ఏర్పడింది. కొంతమంది వ్యాపారులు సరుకు సరఫరా రైతులకు సరిపడా అందకపోవడం వలన యూరియా బస్తా రూ.270లు , పరిస్థితిని బట్టి రూ. 400 నుంచి 500ల వరకు అమ్మడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సంబంధిత అధికారులు వ్యవసాయ శాఖ సమన్వయం లేకపోవడం వలన ఎంత కావాలో ఊహించుకోకపోవడం వలన ఈ పరిస్థితి ఏర్పడింది. సొసైటీలో గంటల తరబడి లైన్లో నిలబడితే మనిషికి రెండు బస్తాలు ఇస్తున్నారు.ఇది ఏ మూలకు సరిపోవడం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించి కేంద్ర ప్రభుత్వం వారిని ఒప్పించి అన్నదాతలు అందరికీ వెంటనే యూరియా సరఫరా చేసి ఆదుకోవాలని రంగారావు కోరారు.

ప్రజల ప్రాణాలు కాపాడండి

విశాలాంధ్ర- తాళ్లపూడి : చేపల వేట నిషిద్ధ సమయాల్లో సైతం సంబంధిత మత్స్యకారులు, అధికారుల పర్యవేక్షణ మరింత కఠినంగా నిర్వహించి, ప్రమాదాల బారిన పడుతున్న అమాయక ప్రజల ప్రాణాలను కాపాడాలని, తాళ్లపూడి పోలవరం, పట్టిసీమ, కొవ్వూరు మండలాల అగ్నికుల క్షత్రియ సంఘాలు కోరాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సహా పలువురు అధికారులకు ఓ వినతి పత్రాన్ని అందించారు. తాళ్లపూడిలో సమావేశమైన అగ్నికుల క్షత్రియులు మాట్లాడుతూ, నిషిద్ధ సమయాల్లో, నిషిద్ధ ప్రాంతం ప్రాజెక్ట్ వద్ద యానాం పరిసర ప్రాంతాలు నుంచి వచ్చి కొంతమంది స్థానిక అగ్నికుల క్షత్రియులపై దాడులకు పూనుకొంటున్నారని ఫిర్యాదు చేసారు. దుండగుల భారీ నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ తాళ్లపూడి పోలవరం మండలాలకు చెందిన అనేక గ్రామాల అగ్నికుల క్షత్రియులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే గోదావరినది తీరం వెంబడి గల కొవ్వూరు, తాళ్లపూడి, పోలవరం మండలాల్లో గోధావరి నదీ తీరం వెంబడి ప్రాంతాల్లో అగ్నికుల క్షత్రియులు గోధావరి నదిపై చేపల వేట సాగిస్తుంటారు. ఎప్పుడైనా వరదల సమయంలో నిషేధ ఆజ్ఞలున్నప్పుడు యానాంకి చెందిన వారు వచ్చిన కొంత మంది తమతో తగువులుపడి ప్రమాద కరమైన బ్యారేజ్ ప్రాంతంలో వేటకు వెళ్లి ప్రమాధాల బారిన పడ్డారు. అందువల్ల నిషేధాజ్ఞలు కఠినంగా అమలు చెయ్యాలని కోరారు. అలాగే అక్రమంగా వేటకు వెళ్ళేవారి పట్ల, తమపై దాడులు జరిపి, వారిపై చట్ట రీత్యా మత్స్య, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని తాళ్లపూడి, పోలవరం, మండలాల అగ్నికుల క్షత్రియులు మల్లాడి పోసియ్య, మచ్చా సూరిబాబు, రెవి చిన్నా, లంకె ప్రకాశం, పెమ్మాడి పోసియ్య, పొన్నాడా అన్నవరం తదితరులు కోరారు.

ఆదిత్య వాలంటీర్ల సేవలు

విశాలాంధ్ర – రాజమండ్రి సిటీ : వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఎ.వి. అప్పారావు రోడ్‌లోవున్న మహాలక్ష్మి దేవాలయంలో ఆదిత్య డిగ్రీ కళాశాల కు చెందిన ఎన్ఎస్ఎస్, యూత్‌రెడ్ క్రాస్ వలం టీర్లు భక్తులకు ఐతోధికమైన సేవలందించారు. ఈ క్రమంలో వరుసలో భక్తులను పంపించడం, వృద్ధులకు, బాలలకు చేయూత నిస్తూ తమ అమూల్యమైన సేవలు అందిం చారు. రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి పర్యవేక్షకు లుగా ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ జి నాగేశ్వరరావు వ్యవహరించగా, పి. ఓ డాక్టర్ బి హెచ్ వి రమాదేవి సహకరించారు. ఆలయ నిర్వాహకులు పి అనంత కుమార్ , పి శ్రీనివాస్, ఎన్ శ్రీనివాస్, వై.సాయిరాం ల అభ్యర్ధన మేరకు ఈ కార్యక్రమంల చేపట్టినట్లు డా. జి.వి.ఎస్.నాగేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమ, యశస్విని, తదితర వాలంటీర్లు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక సేవా స్ఫూర్తితో నున్న కళాశాల ఒక్క ఆదిత్య కళాశాల యేనని దీనికి ముఖ్య కారకులు డాక్టర్ జి .వి .ఎస్ నాగేశ్వరరావు గారని, వారి సేవలు మరువలేమని ప్రిన్సిపాల్ సి హెచ్ ఫణి కుమార్ అన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య సేవలు తనిఖీ

విశాలాంధ్ర – సీతానగరం: ఆయుష్ మాన్ ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలను నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ టీమ్ వర్చువల్‌గా తనిఖీ చేశారని, మండల వైద్య అధికారి డాక్టర్ చైతన్య అన్నారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల చినకొండేపూడి -2లో ఆయుష్ మాన్ ఆరోగ్య మందిరను శు క్రవారం నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ టీమ్ వర్చువల్‌గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పర్య వేక్షణాధికారి డాక్టర్ నవీన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించే దృఢ సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను నిర్మించిందన్నారు. వీటిలో 14 రకాల టెస్టులు,105 రకాల మందులు ఇక్కడ ఉచితంగా అందుబాటులో ఉంచిందని వీటిని ప్రజలు పూర్తిగా వినియోగించు కోవాలన్నారు. తూర్పు గోదావరి జిల్లా ఎన్ క్యూ ఏ ఎస్ కన్సల్టెంట్ డా.సుధ మాట్లాడుతూ వారం రోజులలో చినకొండేపూడి.2 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి ఎన్క్యూఏ ఎస్ నుంచి ధృవీకరణ పత్రం వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైద్య అధికారి డాక్టర్ చైతన్య, డాక్టర్ శైలజ రాణి వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తొలగించేందుకు చర్యలు: ఎమ్మెల్సీ

విశాలాంధ్ర – రాజానగరం : ప్రజల కష్టాలు తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. మండలంలోని చక్రద్వార బంధం, వెలుగుబంద గ్రామాలకు రాకపోకలకు ఇబ్బం దిగా ఉన్న జాతీయ రహదారిలో మార్పుల కోసం హైవే రీజనల్ అధికారి ఆర్‌కె సింగ్‌తో కలిసి ఎమ్మెల్సీ సోము వీర్రాజు శుక్రవారం రహదారి ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక గైట్ కళాశాల సమీపం వద్ద నుంచి చక్రద్వార బంధం, వెలుగుబంద గ్రామాలు వెళ్లేందుకు సరైన దారి లేకపోవడం అటుగా వెళ్ళే ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటిని నిర్మూలిం చేందుకు జీఎస్ఎల్ ఆసుపత్రి వద్ద ఫ్లైఓవర్, నన్నయ యూని వర్సిటీ ఎదురుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధిత అధికారులతో చర్చలు జరిపామని,దీనిలో భాగంగా పరిశీలనకు అధికారులు విచ్చేసినట్లు చెప్పారు. ఈ అభివృద్ధి పనులపై త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షులు ఆళ్ల శివ నాగరాజు , టీడీపీ నాయకులు నాతిపం జూన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పెద్ద పులి చెరువు వద్ద నుంచి సాయి నగర్‌కు వెళ్ళే రోడ్డును కలుపుతూ పంచాయతీ రాజ్ శాఖ నిధులు సుమారు రూ.50 లక్షలతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు మార్గం పూర్తయితే ఏడిపి రోడ్డు నుంచి నేరుగా సాయి నగర్ రోడ్డు వరకు కలుస్తుంది దీంతో అమ్మానమ్మ కాలనీ బైడెకొ ఇళ్లలకు దారి మార్గం దగ్గరికి అవుతుంది. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడబాల కుమార స్వామి..బడుగు శ్రీకాంత్.. కౌన్సిలర్ బలుసు వాసు దేవల్ల విజయలక్ష్మి శివప్రసాద్..కంటే బాబు..యార్లగడ్డ చిన్నీ..పడాల వీరబాబు..పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఎబెట్ పిచికారి

విశాలాంధ్ర - కరప : దోమల నివారణకు కరప గ్రామం శివారు పేపకాయల పాలెంలో ఎబెట్ దోమల మందును పిచికారి చేయడం జరిగిందని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగిరెడ్డి గంగాధర్ పేర్కొన్నారు. కరప గ్రామంలో డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు, ఫైలేరియా వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయని వీటి నుండి ప్రజలను డ్రైనేజీలు, మురుకు కుంటల్లో దోమల మందులన పిచికారి, బ్లీచింగ్ వంటి పౌడర్లను తేమ ప్రదేశాలలోనూ, సాయంత్రం సమయంలో ఫాగింగ్ వంటి పనులను చేయించడం జరుగుతుందని కాకినాడ రూరల్ శాసనసభ్యులు ఎమ్మెల్యే పంతం నానాజి ఆదేశాలతో చేయడం జరుగుతుందన్నారు.

రైల్వే స్టేషన్‌లో 'స్వచ్ఛత హస్తఅక్షర'

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట రైల్వే స్టేషన్లో శుక్రవారం స్వచ్ఛత హస్త అక్షర కార్యక్రమం రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వచ్ఛ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా సామర్లకోట రైల్వే స్టేషన్ పరిధిలో చేపడు తున్న స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణపై ప్రయాణికుల నుండి అభిప్రాయ సేకరణ, సలహాలను ఈ స్వచ్ఛ హస్తఅక్షర కార్యక్రమం ద్వారా సేకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రయాణీకులు పాల్గొని స్వచ్ఛత కార్యక్రమాలపై అభిప్రాయాలు, సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొనగా పారిశుధ్య సిబ్బంది రైలు ట్రాకుల్లో, డ్రైయిన్లలో చెత్తను, ప్లాస్టిక్‌ను సేకరించి స్టేషన్ ఆవరణలో పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రయాణీకులు పాల్గొన్నారు.

బండారులంకలో వరలక్ష్మీ వ్రత పూజలు

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం రూరల్ మండలం బండారులంక శ్రీ భువనేశ్వరి సమేత త్రయంభ కేశ్వర స్వామి ఆలయంలో పవిత్ర శ్రవణ వరలక్ష్మి వ్రతము, సందర్భంగా శ్రీ భువనేశ్వరి అమ్మ వారికి అష్ట ద్రవ్య అభిషేకములు, ప్రత్యేక పూజలు, అలంకరణము, 108 బంగారు పుష్పాల పూజలు, గో పూజ, అనంతరం ప్రసాదము వితరణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'నేను ఉన్నాను' భరోసా : కలెక్టర్

- ప్రజలకు మార్గదర్శకురాలిగా నిలిచిన కలెక్టర్
- స్పందన జీవిత ఆశయాన్ని నేరవేర్చేసింది
- ఆర్థిక సాయం కాదు.. సమయానుకూల స్పందనే నిజమైన తోడు

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : మానవత్వం పరిమళించింది. చిన్న వయసులో తల్లి దండ్రులను కోల్పోయిన రాజానగరం మండలం, నందరాడ గ్రామానికి చెందిన మేడిశెట్టి నీరజ, MSc (Zoology) పూర్తి చేసి డెహ్రాడూన్‌లో GATE కోచింగ్ చేయాలనే కలతో వున్నారు. ఆమె అన్న హరికృష్ణ ఆధారంగా జీవనం సాగిస్తున్న ఈ కుటుంబం ప్రస్తుతం ఆర్థికంగా కష్టకాలంలో ఉంది. ఉద్యోగం కోల్పోయిన అన్న, అద్దె ఇంట్లో కష్టాలు పడుతున్న పరిస్థితుల్లో, నీరజ తన ఆశయాన్ని వదులుకోక, జిల్లా కలెక్టర్‌నీ తగిన సహాయం చేయవలసినది కోరారు. ఈ పరిస్థితిని పీజీఆర్ఎస్ ద్వారా తెలుసుకున్న జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి , సమయాన్ని నష్టపోకుండా వెంటనే స్పందించారు. వారి బాధను స్వయంగా గ్రహించిన కలెక్టర్ గురువారం తన కార్యాలయానికి పిలిపించి 'నేను ఉన్నాను' అనే భరోసా ఇచ్చారు. ఇది సాంప్రదాయ ఆర్థిక సహాయం కాదు - సమయానుకూల స్పందన ద్వారా ఒక యువతి కలల సాకారానికి ప్రాణం పోసిన ఘట్టం. ఆమెకు డెహ్రాడూన్‌లో కోచింగ్ కోసం రూ.40,000 చెక్కును అందజేశారు. అంతే కాకుండా, హరికృష్ణకు అర్హతకు తగిన ఉద్యోగం కల్పించే అవకాశాల కోసం చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఘటన పి-4 కార్యక్రమానికి గల అసలైన ఉద్దేశాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రజల అభ్యర్థనలకు, బాధలకు కాలయాపన లేకుండా స్పందించే అధికారి ఎలా ఉండాలో కలెక్టర్ చూపించారు. గతంలో మలకపల్లి గ్రామానికి చెందిన ఓ చర్మకార కుటుంబాన్ని దత్తత తీసుకుని ఆదర్శంగా నిలిచిన ఆమె, ఇప్పుడు మరోసారి ప్రజల మధ్య మానవత్వం పరిమళించేలా చేశారు. ఇలాంటి ఉదాహరణలు అధికార యంత్రాంగంపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడమే కాక, పి-4 కార్యక్రమాన్ని విజయవంతంగా మలచడానికి బలమైన స్ఫూర్తిగా నిలుస్తాయి. సాయం అంటే కేవలం డబ్బు కాదు - అవసర సమయంలో నడిచే తోడు కావాలి అనే విషయాన్ని కలెక్టర్ తార్కికంగా నిరూపించారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం విద్యానిధి కళాశాలలో విద్యార్థినీ ఆత్మహత్యకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కోకన్వీనర్ కే శంకర్, కే ప్రణీత్ సాయి ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యానిధి కళాశాల విద్యార్థిని ఆత్మహత్య అత్యంత బాధాకరమ న్నారు. కార్పొరేట్ చదువుల్లో విద్యార్థుల మరణాలు కొత్త కాదని భవిష్యత్తులో ప్రభుత్వం వీటిని నియంత్రించే కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్య, నిర్బంధ విద్య రెండిటికీ తేడా ఉందని కార్పొరేటర్ కళాశా లలు కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులు నిర్బంధించి మార్కులు రావాలని వేధింపులకు గురిచేస్తూ వారి మరణాల కారణం అవుతున్నారని వారు వాపోయారు. ఇటీవల రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాలలో విద్యార్థుల మరణాలు చాలా ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోపిడీ చేస్తున్నటువంటి కాలేజీ యాజమా న్యాలు విద్యర్థుల ఆరోగ్య, మానసిక పరిస్థితులు ఎక్కడ పట్టించుకున్న పాపాన పోవడం లేదని, నిబంధనలను తుంగలో తొక్కి ఒకే క్లాసులో 100 మంది పైగా కుక్కి చాలీచాలని ఫ్యాకల్టీతో చదువులు చెప్పించి మార్కులు రావాలని ఒత్తిడులు చేస్తున్నారు. విద్యార్థి మా మరణానికి కారణమైనటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థి కుటుంబాన్ని కాలేజీ పర్మిషన్ రద్దు చేయాలని, విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : బీజేపీ వారధి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. వారధి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ క్రమంలో ప్రజల అభివృద్ధి, సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. 77 సంవత్సరాలలో ఏనాడూ లేని విధంగా మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితులలో రాష్ట్రం పెట్టుబడులకు కేంద్రంగా ఉండనుకుంటే జగన్ దానిని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా పరామర్శలు పేరుతో దండ యాత్రలు చేస్తున్నారన్నారు. జగన్ -1 లోనే ప్రజలను పట్టించుకోలేదని, ఇక జగన్-2 లో విధ్వంసమే అన్నారు. బంగాళా పాళ్యం లో పరామర్శకు వెళ్ళినపుడు పేటీఎం బ్యాచ్‌తో జగన్ వికృత చేష్టలు చేయించి పోలీసులు, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారన్నారు. లిక్కర్ కుంభకోణంలో మూలాలు కదలడంతో తాను జైలుకు వెళ్లడం ఖాయమని, ఈ వికృత చేష్టలకు పాల్పడుతున్నారని, రాష్ట్రంలో ఎవ్వరు పెట్టుబడులు పెట్టకుండా ఉండాలన్న దురుద్దేశంతో జగన్ ఇలా ప్రవర్తిస్తున్నారన్నారు. జగన్‌ను తన పార్టీలోని సీనియర్ నాయకులే పట్టించుకోవడం లేదని, అనేక కార్యక్రమాలు ప్రకటిస్తున్న ఎవ్వరూ స్పందించడం లేదన్నారు. లిక్కర్ కుంభకోణం అవినీతికి మోడల్‌గా నిలిచి పోయిందని, జగన్ అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ అని విమర్శించారు. తల్లిని, చెల్లిని జగన్ ముంచేసాడని, వైస్సార్ సీపీ కూడా మునిగి పోయే నావ అన్నారు. త్వరలో జగన్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అనుగుణంగా కృషి చేస్తుంటే జగన్ వికృత చేష్టలు చేస్తున్నారన్నారు. బీజేపీ చిత్తశుద్ధి తో అంకిత భావం తో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. అదే విధంగా పార్టీ ఆధ్వర్యంలో 10, 11, 12 తేదీలలో తిరంగా ర్యాలీలు, 15న పెద్ద ఎత్తున జెండాలు ఎగుర వేసి దేశ భక్తిని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, బీజేపీ పూర్వ అధ్యక్షులు బొమ్మల దత్తు, బీజేపీ నాయకులు రొంగల గోపి శ్రీనివాస్, యానాపు ఏసు, పురగంటి సతీష్, బూర రామచంద్ర రావు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ వారధి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆనం కళా కేంద్రంలో మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించమని బీజేపీ జిల్లా కల్చరల్ కన్వీనర్ చింతపల్లి సతీష్ తో పాటు పలువురు కళాకారులు విజ్ఞప్తి చేశారు.

ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డా బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వెలసియున్న శ్రీ జగన్మోహిని కేశవ అండ్ గోపాల స్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ అయ్యింది. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ సభ్య కార్యదర్శి కార్యాలయం నుంచి ఆగస్టు 7న విడుదలైన Rc.No.B1/COE-12026(31)/5/2025-7 ఉత్తర్వుల మేరకు ఈ నియామక ప్రక్రియ చేపట్టబడింది. ధర్మకర్త పదవికి దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు కనీసం 30 సంవత్సరాలు వయస్సు నిండినవారు, హిందూ మతాన్ని మరియు సంప్రదాయాలను ఆచరించేవారు, పూర్తిస్థాయి ఆరోగ్యవంతులై ఉండాలని నిబంధనల్లో పేర్కొన్నారు. దరఖాస్తులు నిర్ణీత గడువు 20 రోజుల్లోగా జిల్లా దేవదాయ శాఖాధికారి లేదా సహాయ కమిషనర్, దేవదాయ ధర్మదాయ శాఖ, అమలాపురం కార్యాల యానికి సమర్పించాలి. మరిన్ని వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించవచ్చని భాగవతుల వెంకట రమణ మూర్తి కార్యనిర్వహణాధికారి తెలిపారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ఆత్రేయపురం గ్రామదేవత శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వేషధారణలో పసుపు, కుంకుమలతో, తాంబూలాలతో పాల్గొని సౌభాగ్యం, ఐశ్వర్యం కోసం అమ్మవారిని ప్రార్థించారు. ఆలయాన్ని పూలతో, రంగోలి శోభాయమానంగా అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శతనామ వ్రతం, ప్రత్యేక హారతులు నిర్వహించగా, భక్తులకు తీర్థప్రసాదాలు, అందజేశారు. ఇక ఆత్రేయపురం మండలం లోని పలు గ్రామాల దేవాలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. వాడపల్లి, ర్యాలీ, అంకం పాలెం, పేరవరం, బొబ్బర్లంక, ఉచ్చిలి, వద్దిపర్రు, వసంతవాడ, లొల్ల, నార్కడిమిల్లి, వంటి ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలలోనూ వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తుల రద్దీ కనిపించగా, ఆలయాల చుట్టూ పండ్ల, పూల, తాంబూలాల విక్రయాజరగడంతో ఉత్సవ వాతావరణం నెలకొంది.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం. అమ్మవార్లను దర్శించుకున్న ప్రజాసేవకులు నందం వీర వెంకట సత్యనారాయణ మండలం పరిధిలోని ఈతకోట గ్రామంలో జాతీయ రహదారి చెంతన కొత్త సెంటర్ నందు కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారిని శ్రావణమాసంలో మూడో శుక్రవారం శ్రావణవరలక్ష్మి వ్రత పండుగను పురస్కరించుకుని ప్రముఖ సీనియర్ రాజకీయ నాయకులు, ప్రజాసేవకులు, రావులపాలెం జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యాకమిటి చైర్మన్ నందం వీర వెంకట సత్యనారాయణ దర్శించుకున్నారు. ఈతకోట గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బలక్ష్మి నాగేశ్వరరావు (బుజ్జి) దంపతులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి నారాయణ చార్యులు(నాని), గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ కమిటీ చైర్మన్ వెలుగట్ల రామకృష్ణ, కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు.

ఘనంగా వరలక్ష్మి వ్రతాలు

విశాలాంధ్ర - పెద్దాపురం : శ్రావణ మాసంలో నిర్వహించే వరలక్ష్మి వ్రతాలను పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మహిళలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కనకదుర్గ, వనదుర్గ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో వ్రతమాచరించి వరలక్ష్మి పూజలు నిర్వహించారు. ప్రతీ ఇంటా మామిడి తోరణాలతో అలంకరించి వరలక్ష్మి పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని చదలాడ, కాండ్రకోట, దివిలి, మర్లావ తదితర ప్రాంతాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో వ్రతమా చరించారు. పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయం, కాండ్రకోట నూకాలమ్మ ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. దివిలి భాస్కర రామా రైస్ మిల్లు వద్ద అమ్మవారిని నెలకొల్పి పూజలు నిర్వహించారు. భక్త భజన మండలి భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా మర్లావలో పలువురు మహిళలు ఆలయంలో పూజలు, వ్రతాలను ఆచరించారు.

భువనేశ్వరీ పీఠంలో : స్థానిక వర్మల వారి వీధిలో వెలసిన భువనేశ్వరీ పీఠంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత మహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వందల సంఖ్యలో భక్తులు హాజరై సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిం చారు. గోపిశర్మ శిష్య బృందం వరలక్ష్మి వ్రత సంకల్పాన్ని చదివి వినిపిస్తూ ఉచితంగా భక్తులకు పూజతో పాటు అమ్మవారి పసుపు, కుంకుమ, ప్రసాదము, రవికల గుడ్డ, అమ్మవారి పోటోలను భక్తులను గోపిశర్మ సిద్ధాంతి చేతుల మీదుగా అందజేశారు.

అన్నప్రసాద భవన నిర్మాణానికి వితరణ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు స్వామివారి వసంత మండపంలో కళ్యాణం, అష్టోత్తర పూజలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. చందన సరూపుడైన వెంకటేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఈ ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి మండపేట మండలం, వెలగతోడు వాస్తవ్యులు గొడవర్తి మంగ బేబీ సరోజ, గొడవర్తి యస్వంత్ కిరణ్ కుమార్, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116లు విరాళం అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు వర్మ, రాపాక శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం రాజవరం, పేరవరం గ్రామాల్లో పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ బి కృష్ణారావు ఆదేశాల మేరకు, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్, 25 మంది సిబ్బందితో కలిసి ఉదయం 5 గంటల నుండి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రికార్డు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాహన యజమానులు సక్రమ పత్రాలు చూపితే వాహనాలు తిరిగి అందజేస్తామని, లేకపోతే వాటిని బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగిస్తామని సీఐ విద్యాసాగర్ తెలిపారు. రాజవరం గ్రామంలో ఓ మహిళ వద్ద 20 లీటర్ల సారా, 400 లీటర్ల బెల్లపూట, డ్రమ్ములు, గ్యాస్ స్టౌవ్ లభించడంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మారుమూల గ్రామాల్లో సారాయి, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ఇటువంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఆత్రేయపురం, కొత్తపేట, ఆలమూరు ఎస్సైలు రాము, సురేంద్ర, నరేష్‌లతో పాటు ఎఎసైలు, హెచ్‌సిలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఘనంగా స్వామినాథన్ జయంతి

విశాలాంధ్ర - కరప : భారతదేశంలో హరిత విప్లవం తీసుకొచ్చిన ఎంఎస్ స్వామినాథన్ ఏడవ జయంతిని ఏపీ కౌలు రైతు సంఘం అధ్యక్షులు ఎం రాజశేఖర్, కార్యదర్శి వల్లు రాజబాబు ఆధ్వర్యంలో కొరుపల్లె గ్రామంలో కౌలు రైతులతో కలిసి ఘనంగా నిర్వహించారు. భారతదేశ ఆహార కొరత తీర్చేందుకు స్వామినాథన్ నూతన వరి వంగడాలను సృష్టించి హరిత విప్లవం తీసుకువచ్చారని నాయకులు తెలిపారు. భారతదేశ ఆహార కొరతను తీర్చడమే కాకుండా విదేశాలకు ఎగుమతి దారుగా భారతదేశాన్ని నిలిపారని తెలిపారు. 2014లో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయంపై స్వామినాథన్ కమిషన్ వేయగా క్వింటాల్‌కు రూ.2000 ఖర్చు అవుతుందని దీనికి అదనంగా 50% కలిపి వ్యవసాయానికి అదనంగా ఇవ్వాలని కేంద్రానికి సిఫారసు చేశారని రాజశేఖర్ తెలిపారు. అయినప్పటికీ కేంద్రం నేటికి స్వామినాథన్ సిఫారసులను అమలు చేయలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నురుకుర్తి నాగేశ్వరరావు, పెంకె సత్యనారాయణ, పెంకె నారాయణ, రెడ్డి వీరభద్రరావు, పెదకాపు, వెంకటరమణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ త్వరగా కోలుకోవాలి : అడపా

విశాలాంధ్ర - కాకినాడ, శంఖవరం : కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి గ్రామములో మాజీ మంత్రి వైసీపీ పీఏసీ సభ్యులు ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కత్తిపూడిలో ప్రసిద్ధిగాంచిన కనకదుర్గమ్మ తల్లికి వైసిపిరాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి అడపా సోమేష్, ఎంపీటీసీలు ఆధ్వర్యంలో ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని పూజలు నిర్వహించారు. రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి అడపా సోమేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ముద్రగడ పద్మనాభం చేసిన సేవలను కొనియాడుతూ రాష్ట్రస్థాయిలో నీతి నిజాయితీ గల నాయకుడిగా చెరగని ముద్ర వేసుకున్న నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు జీలకర్ర విష్ణు, చల్లా ప్రసాద్, సప్పా రాంబాబు, జీలకర్ర లక్ష్మణరావు, తుపాకీ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతన్నల ఎదురుచూపులు

విశాలాంధ్ర - గండేపల్లి : ఏరు దాటే దాకా ఓడ మల్లన్న...ఏరు దాటాక బోడి మల్లన్న...అన్న చందంగా జగ్గంపేట నియోజకవర్గంలో పుష్కర ఆయకట్టు రైతులను శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ మోసం చేశారని, నేడు పుష్కర ఆయకట్టు రైతులు అగమ్య గోచరంగా అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఓటేసి గెలిపించండి గెలిచిన వెంటనే పుష్కర తాళ్లూరు లిఫ్ట్, పైపులైను పూర్తిగా మార్చి సాగునీరు అందిస్తానని వాగ్దానాలు చేసి గద్దెనెక్కేక ఈ ఒక్క పంటకు విరామం ఇవ్వండి నిధులు తెస్తాను, పనులు చేయిస్తాను వచ్చే పంటకు పూర్తిస్థాయిలో నేను నీరిస్తాను అని నమ్మబలికిన శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ పుష్కర రైతులను మోసం చేశారని సూర్యచంద్ర ఆరోపించారు. గత సంవత్సరంలో ఈ ఒక్క పంటకి ఆగండి వచ్చే పంటకు తప్పనిసరిగా నీరిస్తాను అన్న ఎంఎల్ఏ జ్యోతుల నెహ్రూ మాటలు నమ్మి గత నెల రోజుల నుండే పుష్కర ఆయకట్టుకి సంబంధించిన అన్ని గ్రామాలలో రైతులు పంటలకు పెట్టుబడి పెడుతున్నారని వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారని పుష్కర నీరు రాకపోవడం వల్ల వేసిన పంటలు, నారుమడులు ఎండిపోయి రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. సాగునీరు ఇవ్వలేనప్పుడు పంటకాలాని కంటే ముందుగానే బాధ్యత కలిగిన శాసనసభ్యుడిగా సంబంధిత అధికారులతో కలిసి ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించ వలసిన అవసరం ఉందని అలా చేయకుండా ఇదిగో గ్రాంట్ తెస్తున్నాను, అదిగో గ్రాంట్ తెస్తున్నాను అని 14 నెలల నుండి కాలయాపన చేస్తూ రైతులను మోసం చేసి రైతన్నలను నట్టేట ముంచారని పాటంశెట్టి సూర్యచంద్ర ఆక్షేపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి కనీసం రెండు కోట్ల రూపాయలు నిధులు తెచ్చి పాడైన పైప్లైన్లు, మోటార్లు రిపేర్లు చేయించి ఈ సంవత్సరం పంట గట్టెక్కించాలని రైతుల పక్షాన డిమాండ్ చేశారు. రైతులకు నీరు ఇవ్వకుండా అన్యాయం చేస్తే రైతులు పక్షాన అండగా నిలబడి రైతులకు న్యాయం జరిగే విధంగా పోరాడుతామని సూర్యచంద్ర స్పష్టం చేశారు.

దళిత యువకుడిపై దాడికి నవీన్‌కుమార్ ఖండన

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ మాట్లాడు తూ కలియుగ వేంకటేశ్వర స్వామి కొలువైన పవిత్రమైన తిరుమల తిరుపతిలో, భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో వైసీపీ అనుచరులు ఒక దళిత యువకుడిపై జరిపిన క్రూరమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ ఘటన దళిత సమాజంపై వైసీపీ నాయకత్వం చూపి స్తున్న దమనకాండకు నిదర్శనం. తిరుపతిలో భూమన కుమారుడు అభియన్ రెడ్డి కార్యాలయంలో వైసీపీ రౌడీలు ఒక దళిత యువకుడిని బంధించి, స్పృహ కోల్పోయే వరకు దారుణంగా కొట్టారు. ఈ ఘటనను వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ బాధితులను మరింత భయపెట్టే ప్రయ త్నం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పుణ్యక్షేత్రమైన తిరుపతిని అపవిత్రం చేయడమే కాకుండా, భూమన కరుణాకర్ రెడ్డి రౌడీయిజం సమాజంలో భయాందోళనలు సృష్టిస్తున్న స్పష్టమైన ఆధారం. తెల్లారితే రౌడీయిజం చేయడం, తర్వాత ప్రెస్‌మీట్లు పెట్టి శుద్ధపూస స్టేట్‌మెంట్లు ఇవ్వడం- ఇదే భూమన నైజం. తిరుమల పవిత్రతను దెబ్బతీసే కుట్ర నిత్యం కొనసాగుతుంది. వైసీపీ ఒక దళిత వ్యతిరేక పార్టీ. అధికారంలో ఉన్నప్పుడు కూడా దళితులపై దమనకాండ కొనసాగించారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా అదే తీరు కొనసాగిస్తు న్నారు. కూటమి ప్రభుత్వం ఎవరినీ వదిలిపెట్టదు. న్యాయం జరిగేలా కఠిన చర్యలు తీసుకుంటుంది. తిరుమల పవిత్రతను కాపాడ దంలో, సమాజంలో శాంతి భద్రతలను నెలకొల్ప దంలో అన్ని విధాలా కృషి చేస్తుంది. ఈ కిరాతకానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు

విశాలాంధ్ర - పెద్దాపురం : కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శు క్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృత భిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, ఛండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తు ఆహ్వానం

విశాలాంధ్ర - కొత్తపేట : మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియమించుటకు గాను దరఖాస్తు చేసుకోవలసిం దిగా కార్యనిర్వహణాధికారి డి సురేష్ బాబు తెలిపారు. జిఒఎంఎస్ నెం.861 రెవెన్యూ (ఎండోమెంట్స్-1) దేవదాయ ధర్మదాయ శాఖ, శు క్రవారం ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు ధరఖాస్తులను ఫారం-II ప్రకారం కార్యాలయమునకు నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి 20 రోజులులోగా పంపవలెను. డి సురేష్ బాబు తెలిపారు.

ఇంట్లో చోరీ

విశాలాంధ్ర - రాజోలు : ములికిపల్లి గ్రామంల్లో తాళాలు వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇంటి యజమాని కట్టా వెంకట లక్ష్మి 7న ఏలూరులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్ళింది. 8 ఉదయం పని మనిషి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఈ విషయం యజమాని వెంకట లక్ష్మికి ఫోన్ చేసి చెప్పింది. ఆమె వచ్చి చేసేసరికి ఇంటి తలుపులు లోపల ఉన్న బీరువా తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. దొంగతనం జరిగింది అని గ్రహించిన వెంకట లక్ష్మి పోలీసులకు సమాచారం అందించింది. సంఘటన స్థలాన్ని రాజోలు సీఐ నరేష్ కుమార్ పరిశీలించారు. క్యూజ్ టీమ్ రంగంలో దిగి వేలిముద్రలు సేకరించారు. బీరువాలో ఉన్న ఐదు లక్షల నగదు, ఆరు కాసుల బంగారు గాజులు చోరీకి గురైనట్లు బాధితురాలు పిర్యాదు పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరేష్ కుమార్ తెలిపారు.

జార్జి పేట ఆదర్శం...

వ్యవసాయం, కూలి పనులు, చదువుకోవటమే వారి లక్ష్యం...

విశాలాంధ్ర -లింగపాలెం: పచ్చని చెట్లు,చుట్టూ పంట పొలాలు... ప్రశాంతమైన పరిస్థితులు...వీరిజీవన విధానమే ఒక ఆదర్శం. ఏలూరు జిల్లా చింతలపూడి నియోజక వర్గం,చింతలపూడి మండలం ప్రగడవరం పంచాయతీలోని జార్జి పేట అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. వ్యవసాయమే ప్రధాన ఆధారంతో జీవనం సాగిస్తున్న వీరందరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు.దాదాపు వందేళ్ళ క్రితం బ్రతకటం కోసం వివిధ ప్రాంతాల నుంచి మూడు కుటుంబాలు వలస వచ్చి ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగించారు.ఇలా ముగ్గురితో ప్రారంభమైన ఈ ప్రాంతం ఒక గ్రామముగా ఏర్పడింది. 60 కుటుంబాలు ఈ గ్రామంలో జీవనం సాగిస్తున్నారు. 350 మంది ప్రజలు,దాదాపు 250 మంది ఓటర్లు గ్రామంలో నివాసం ఉంటున్నారు. కష్టపడటమే వీరి ప్రధాన వృత్తిగా ఉంది. పడిన కష్టం నుంచి వ్యవసాయ భూములు కొనుక్కొని వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇక్కడ నివసించే ప్రతి ఒక్కరికి దాదాపు రెండు ఎకరాలు వ్యవసాయ భూమి తక్కువ కాకుండా ఉంది. వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ వీరి జీవన పరిస్థితిని అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నారు. ఒకప్పుడు వ్యవసాయ కూలీలుగా ఉన్న వీరంతా తమ పిల్లలను చదివించడంలో విజయాలు సాధించారు. ప్రతి ఇంటిలో విద్యావంతులు ఈ గ్రామంలో ఉన్నారు. ఎందరో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. చాలామందికి జార్జి పేట ఉన్నట్లుగానే తెలియదు. గ్రామం గురించి తెలిసినవారు పరిశీలిస్తే వీరి విజయాలు ఒక్కొక విజయగాథలగా చెప్పొచ్చు. ప్రతి ఇంటిలో అందరిని చదివిస్తుంటారు. ఖాళీ సమయాలలో సొంత వ్యవసాయం చేసుకుంటూ

వ్యవసాయ కూలీలుగా పనులు చేస్తూ ఆర్థిక పరిస్థితులకు లోటు లేకుండా జీవనం సాగిస్తూ నే చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నారు. దాదాపుగా ఇంటికొక ఉద్యోగస్తుడు ఈ గ్రామంలో ఉన్నారు. బీటెక్,ఎంటెక్,డిగ్రీ ఇలా అన్ని రకాల విద్యావంతులు ఈ గ్రామంలో ఉండటం విశేషం. ఉపాధ్యాయులుగా, సాంఘిక సంక్షేమ శాఖలో, పంచాయతీరాజ్, ఇరిగేషన్, జైళ్లశాఖలో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. థియాలజీ చదివి ముగ్గురు మత గురువుగా పనిచేస్తుంటే మరో ముగ్గురు థియాలజీ చదువుతున్నారు. నర్సులుగా పనిచేస్తున్న వారు ఉన్నారు. ప్రైవేటు ఉద్యోగాలు చేసేవారు అనేకమంది ఉన్నారు. బీఈడీ,టీటీసి చదివిన వారు ఉన్నారు.నన్సుగా ఇద్దరు ఉన్నారు.అటు వ్యవసాయంలో, ఇటు విద్యాభివృద్ధిలో వీరి కృషి ఆదర్శంగా చెప్పుకుంటుంటారు. ఉద్యోగాలు రాలేదని నిరుత్సాహం చెందరు. తమకున్న వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకుంటూ వీలున్నప్పుడల్లా కూలి పనులకు వెళ్తూ ఎవరికి వారు తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని నిలుపు కుంటున్నారు. ఈ గ్రామం గురించి తెలిసిన వారంతా ఇదొక ఆదర్శ గ్రామంగా చెపుతుంటారు. ఇటువంటి గ్రామాన్ని ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు సందర్శించి వీరి యొక్క ఆదర్శాన్ని వివిధ గ్రామాలలో ఉన్న వారికి పాఠంగా చెప్పొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

13న జాబ్ మేళా : మంత్రి సుభాష్

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో వారం నిర్వహించే జాబ్ మేళాలో భాగంగా ఈ నెల 13న ఉదయం 10 గంటలకు రామచంద్రపురంలోని ఉపాధి భవన్లో జాబ్ మేళా జరుగుతుందని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ జాబ్ మేళాలో ఎల్ అండ్ టి కన్‌స్ట్రక్షన్స్, ట్రైటెక్, ఆవిష్కరన్, ఎంఆర్ఎఫ్, వెల్స్పన్ వంటి దిగ్గజ కంపెనీలు హాజరుకానున్నారు. ఎల్ అండ్ టి కన్‌స్ట్రక్షన్స్ నందు 10వ తరగతి, ఐటీఐ, కార్పెంటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, మేషన్, వెల్డర్, ప్లంబర్, వైర్ మెన్, ఎలక్ట్రీషియన్, బిల్డింగ్ కన్స్ట్రక్షన్ చదివిన 35 సంవత్సరాలలోపు పురుష అభ్యర్థులకు రెండు నెలల శిక్షణ తదుపరి ఉద్యోగం ఇచ్చే విధంగా వివిధ రకాల టెక్నీషియన్‌లకు రూ.16000 నుంచి రూ.18000 వేలు జీతము, ఉచిత వసతి చెల్లించే విధముగా వైజాగ్, అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో పనిచేయుటకు ఎంపికలు జరుగును. రెండు నెలల శిక్షణ కాలంలో ఎటువంటి జీతము చెల్లించబడదు. ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పించబడును. ట్రైటెక్‌లో ఐటీఐ ఫిట్టర్ చదివిన 18 నుండి 35 సంవత్సరాలలోపు పురుష అభ్యర్థులకు టెక్నిసియన్స్ పోస్టులకు. ఆవిష్కరన్‌లో 10వ తరగతి చదివిన 18 నుండి 35 అభ్యర్థులకు అసెంబ్లీ ఆపరేటర్ పోస్టులకు. ఎంఆర్ఎఫ్, వెల్స్పన్‌లో 10, ఇంటర్, ఐటిఐ చదివిన 18 నుండి 28 సంవత్సరాలలోపు పురుష అభ్యర్థులకు ప్రొడక్షన్, మెషిన్ ఆపరేటర్‌గా పోస్టులకు ఎంపికలు నిర్వహిస్తారు. ట్రైటెక్, ఆవిష్కరన్, ఎంఆర్ఎఫ్, వెల్స్పన్ కంపెనీలలో ఎంపికైన వారికి హైదరాబాద్‌లో రూ.16,000 నుండి 25,000 వేలు జీతముతో పాటు ఉచిత భోజన, రవాణా, వసతి సదుపాయాలు కల్పించబడును. రామచంద్రపురం కేవీర్ హాస్పిటల్ వెనుక గల ఉపాధి భవన్ నందు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించబడునని, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, ఉపాధి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాంకుమార్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్ మేళాకు మరిన్ని వివరాలు కోసం : 9515481671 నెంబర్‌ను సంప్రదించగలరు.

మాట నిలబెట్టుకున్న మంత్రి

విశాలాంధ్ర - అమలాపురం : పేదల గుండెల్లో గూడు కట్టుకుంటున్న మంత్రిసుభాష్. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం..ఆపద అంటే ఆదుకోవడం..కష్టంలో ఉన్న వారిని చూసి కనికరించడం ఆయన దినచర్య. వివరాల్లోకి వెళితే కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామం తోటకాలనీకి చెందిన ఓ నిరుపేద మహిళ సుందరపల్లి జ్యోతి తన ఇద్దరు కుమార్తెలు సుందరపల్లి సత్య, అనూషలతో నిలవడానికి గూడు లేక చిన్న ప్లాస్టిక్ దేరా కట్టుకుని బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఎండకు వానకు ఆగని పరిస్థితి. జ్యోతి భర్త శేషారావు ఇటీవల కాలంలో బలవన్మరణం పొందారు. ఇంటి పెద్దదిక్కు ఉపాధి కోల్పోయిన ఆ కుటుంబం దీనస్థితిలో ఉన్నారు. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పేరిట కూటమి ప్రభుత్వం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కి ఆ నిరుపేద కుటుంబం తారసపడింది. ఆమె కష్టాలు విన్న మంత్రి చలించిపోయారు. మరో ఆలోచన లేకుండా ఆ పేద మహిళలకు గూడు నిర్మించి ఇవ్వాలని సంకల్పించారు. త్వరలోనే మీకు ఇల్లు నిర్మిస్తానని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఇరువురు కుమార్తెలకు ఉపాధి అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే క్రమంలో శుక్రవారం మంత్రి సుభాష్ గొల్లపాలెం వెళ్లి ఆ పేద మహిళ కుటుంబం, కూటమి నాయకులు, గ్రామ ప్రజల సమక్షంలో ఆ కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందజేసి, నూతన గృహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకూ ఆ కుటుంబాన్ని వేరే అద్దె గృహంలో ఉంచి, నెలవారి అద్దె తానే చెల్లిస్తానన్నారు. మాట ఇవ్వడం..వెంటనే గృహ నిర్మాణానికి వేగవంతంగా భూమి పూజ చేయడంతో ఆ కుటుంబంలో చెప్పలేనంత ఆనందం, కన్నీటి భాష్పాలతో మంత్రి సుభాష్ కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులు, గ్రామ ప్రజలు సైతం ఔరా..మంత్రి సుభాష్ ప్రేమ, కరుణ, సేవాగుణం పట్ల ఉబ్బి తబ్బిబ్బయ్యారు. మంత్రి సుభాష్ సామాజిక సేవా గుణానికి చేతులెత్తి మొక్కారు. ఇదే కదా నిజమైన మానవత్వం అంటూ కీర్తించారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

విశాలాంధ్ర - కాకినాడ : ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ డా చెలికాని కృష్ణమోహన్ రావు తెలిపారు. బ్యాంక్ సభ్యులు సిబ్బంది పిల్లల్లో ప్రతిభ కనబరిచిన పదో తరగతి విద్యార్థులు ఆరుగురుకి రూ. 5000, ఇంటర్ విద్యార్థులు ఐదుగురుకి రూ.7500 JJE అడ్వాన్స్ ఒక్కరికి రూ.10,000 వంతున నగదు పురస్కారాలు ప్రశంస పత్రాలను కాకినాడ బ్రాంచ్‌లో బ్యాంక్ ఆవరణంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకి జరిగిన కార్యక్రమంలో అందజేశారు. జోనల్ మేనేజర్ T.R దాగూర్, బ్యాంక్ మేనేజర్ రావు వెంకట రామారావు, కమిటి మెంబర్లు, బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'సోదరి సోదర బంధానికి రక్షా బంధన్'

ప్రకృతి పరిరక్షణకు -వృక్షా బంధన్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం. ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా నల్లమిల్లి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత రక్షాబంధన్ కాదు వృక్షా బంధన్‌కు ప్రాతినిధ్యం వహించి ప్రాముఖ్యత ఇచ్చి ప్రకృతిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. శనివారం రాఖీ పౌర్ణమి పర్వదినం రక్షా బంధన్ సందర్భంగా ముందుగా అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ డా సతీష్ రెడ్డి దేశ ప్రజలకు యువతకు ప్రత్యేక విజ్ఞప్తి చేస్తున్నాను అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఇంటికి మొక్క నాటాలని కోరితే, సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్ర మోదీ అమ్మ పేరుతో ఒక మొక్క నాటి ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అయినా ప్రజలు ఈ

విషయాలపై పెద్దగా ఆసక్తి లేకపోవడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో అడవులను నరికి కాంక్రీట్ జంగిల్‌లు పెంచుకుంటూ ప్రకృతిని ధ్వంసం చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వర్షాభావ పరిస్థితులు, ఉష్ణోగ్రతలో పెనుమార్పులు సంభవించి అనేక ఇబ్బందులు గురికావడం చూస్తున్నామని, యువత ప్రకృతి పరిరక్షణకు నడుం కట్టి నేటి ఈ 'సోదర-సోదరి' బంధానికి ప్రతీక అయిన 'రక్షా బంధన్' పర్వదినం నుంచి ప్రతీ ఒక్కరూ తమ సోదరుల పేర ఒక మొక్కను నాటి ప్రకృతి పరిరక్షణకు తద్వారా పచ్చని పర్యావరణాన్ని భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని ఆదిత్య యూనివర్సిటీ తరపున విజ్ఞప్తి చేస్తున్నాను అని డా సతీష్ రెడ్డి పిలుపునిచ్చారు. సోదరుడు తన సోదరి పేరిట అలాగే సోదరి తన సోదరుల పేరిట మొక్కలు నాటి వారి పట్ల గల ప్రేమను మొక్కలపై చూపించినప్పుడు త్వరలోనే యావత్ ప్రపంచం పచ్చని చెట్లతో ఆరోగ్యకరమైన వాతావరణంతో పరిఢవిల్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులచే తమ సహోదరుల పేరిట మొక్కలు నాటి పెంచి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా మేడపాటి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ డా ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్స్ డా ఎస్ రమాశ్రీ, డా ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ జి సురేష్, ఆదిత్య టి హబ్ సిఈఓ బాబ్జి నీలం, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.